# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-09-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. జీఎస్టీ సంస్కరణలు ఆర్థిక స్వావలంబనకు దోహదపడతాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
2. తెలంగాణలోని ములుగు జిల్లా, తాడ్వాయి మండలంలోని మేడారంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ఈ రోజు పర్యటించనున్నారు.
3. కాలుష్య నియంత్రణ, పర్యావరణ కార్యక్రమాల్లో యువత, విద్యార్థులను భాగస్వాములను చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ అధికారులకు సూచించారు.
4. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ క్రీడా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.
5. సమగ్రమైన వైద్య చికిత్స పద్ధతిగా ఆయుర్వేదాన్ని ప్రోత్సహించేందుకు ఈ రోజు ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

==========================

వస్తుసేవల పన్ను- జీఎస్టీ సంస్కరణలు ఆర్థిక స్వావలంబనకు దోహదపడతాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. జీఎస్టీ సంస్కరణలపై రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టనున్న కార్యక్రమాలపై నిన్న శాసనసభలో మాట్లాడారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధనకు జీఎస్టీ సంస్కరణలు ఉపయోగపడతాయని తెలిపారు. నూతన సంస్కరణలతో రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 33 సెకన్లు

-------------------------

తెలంగాణలోని ములుగు జిల్లా, తాడ్వాయి మండలంలోని మేడారంలో ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ఈరోజు పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా సమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పాట్లను, శాశ్వత సౌకర్యాల ప్రణాళికలను ముఖ్యమంత్రి పరిశీలిస్తారు. అలాగే మేడారంలో అభివృద్ధి పనులు, మహా జాతర ఏర్పాట్లపై పూజారులు, ఆదివాసీ నాయకులు, మంత్రులు, గిరిజన పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులతో సమీక్ష నిర్వహించనున్నారని అధికారులు తెలిపారు.

-------------------------

విజయవాడ ఉత్సవ్ నిర్వహణతో విజయవాడ నగరానికి మరింత గుర్తింపు వస్తుందని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. విజయవాడ పున్నమి ఘాట్ వద్ద విజయవాడ ఉత్సవ్‌ను పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడుతో కలిసి గత సాయంత్రం మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...

..వాయిస్.. 25 సెకన్లు

---------------------------

కాలుష్య నియంత్రణ, పర్యావరణ కార్యక్రమాల్లో యువత, విద్యార్థులను భాగస్వాములను చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అధికారులకు సూచించారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో ఉప ముఖ్యమంత్రి అసెంబ్లీలోని తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, ఫార్మా సంస్థల్లో కాలుష్య నియంత్రణ నిబంధనల అమలును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, దీని కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని ఆదేశించారు.

---------------------------

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ క్రీడా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర క్రీడా సంఘాలతో మంత్రి నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 15 నెలల్లోనే రాష్ట్రంలో ఎన్నో క్రీడా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామన్నారు. క్రీడాకారుల కోసం ఉద్యోగాల్లో ప్రభుత్వం కల్పించిన 3 శాతం రిజర్వేషన్లు వినియోగించుకోవాలని సూచించారు.

---------------------------

ప్రజాసేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కృషి చేస్తోంది. “సేవా పర్వ్” పేరుతో ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఏకీకృత చెల్లింపుల వ్యవస్థ –యూపీఐ ద్వారా డిజిటల్ చెల్లింపులను కేంద్రప్రభుత్వం ఎలా అందరికీ అందుబాటులోకి తెచ్చిందనే వివరాలను ఈ రోజు తెలుసుకుందాం.

వాయిస్ ఓవర్ (01.06 సెకన్లు)

---------------------------

సమగ్రమైన వైద్య చికిత్స పద్ధతిగా ఆయుర్వేదాన్ని ప్రోత్సహించేందుకు ఈరోజు ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 2016లో కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది. అప్పటినుండి ప్రతి యేటా సెప్టెంబర్ 23న ఆయుర్వేద దినోత్సవాన్ని జరుపుకుంటారు. నివారణ ప్రధానమైన ఆరోగ్య సంరక్షణలో ఆయుర్వేద వైద్య చికిత్స పద్ధతి ఓ కీలక పాత్రను పోషిస్తోంది. యువత, దేశ ప్రజలు ఆయుర్వేదాన్ని జీవన విధానంగా స్వీకరించేలా పలు కార్యక్రమాల ద్వారా ఈరోజు అవగహన కల్పిస్తారు.

---------------------------

‘పరిశుభ్రమైన భారతదేశం’ను సృష్టించే దార్శనికతతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2014 అక్టోబర్ 2న దేశవ్యాప్తంగా స్వచ్ఛ భారత్ మిషన్‌ను ఒక జాతీయ ఉద్యమంగా ప్రారంభించారు. స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించేందుకు ఈ ఈనెల 17 నుండి

అక్టోబర్ 2 వరకు పక్షం రోజుల పాటు 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయి. ఈ ఏడాది 'స్వచ్ఛోత్సవ్' ఇతివృత్తంతో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

---------------------------

పోషకాహారలోపంతో ఉన్న వారిని గుర్తించి వారికి ప్రత్యేక ఆహారాన్ని అందించేలా చర్యలు తీసుకుంటున్నామని పల్నాడు జిల్లా సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం– ఐ.సి డి.ఎస్ అధికారిణి శ్రీలత తెలిపారు. పల్నాడు జిల్లా చౌటపాపాయపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన పోషణ్ మాసం, స్వస్త్ నారీ సశక్త్ పరివార్ సదస్సులో నిన్న పాల్గొన్నారు.

---------------------------

ఈశాన్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడిందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. రానున్న 24 గంటల్లో ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదిలే అవకాశముందని, దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేస్తూ..

..వాయిస్.. 23 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ ఈరోజు, రేపు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================